నమస్తే తెలంగాణ
భద్రాద్రి కొత్తగూడెం
5 | ఖమ్మం, మంగళవారం 2 జనవరి 2024 | BHADRADRI KOTHAGUDEM

## కేటీఆర్‌ను కలిసిన వద్దిరాజు, కోనేరు



కేటీఆర్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న వద్దిరాజు, కోనేరు

భద్రాద్రి కొత్తగూడెం, జనవరి 1 (నమస్తే తెలంగాణ) : రాష్ట్ర బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు చెందిన ఆ పార్టీ నాయకుడు కోనేరు సత్యనారాయణ(చిన్ని) మర్యాదపూర్వకంగా కలిశారు. సోమవారం హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కేటీఆర్ వారితో మాట్లాడారు. వచ్చే ఎంపీ ఎన్నికలు, స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధంగా ఉండాలని సూచించారు.

## జిల్లా ప్రజలంతా సుభిక్షంగా ఉండాలి

### ఖమ్మం ఎంపీ నామా నాగేశ్వరరావు


క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న ఖమ్మం ఎంపీ నామా నాగేశ్వరరావు

ఖమ్మం, జనవరి 1: ఉమ్మడి ఖమ్మం జిల్లా ప్రజలంతా ఈ కొత్త సంవత్సరంలో సుఖ సంతోషాలు, సిరిసంపదలు, ఆయురారోగ్యాలతో జీవించాలని బీఆర్‌ఎస్ లోక్ సభా పక్ష నేత, ఖమ్మం ఎంపీ నామా నాగేశ్వరరావు ఆకాంక్షించారు. శాంతి, ఆరోగ్యం, సిరిసంపదలతో శోభిల్లాలని, లక్ష్యాలను సాధించాలని, పంటలు సమృద్ధిగా చేతికొచ్చి రైతులు, ప్రజలు సుభిక్షంగా ఉండాలని అభిలషించారు. న్యూ ఇయర్ సందర్భంగా నామా సేవా సమితి బాధ్యులు రూపొందించిన క్యాలెండర్‌ను ఖమ్మంలోని తన స్వగృహంలో సోమవారం ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. కొత్త సంవత్సరం మరింత ఆనందంగా ఉండాలని, అందరి జీవితాల్లో సరికొత్త వెలుగులు నింపాలని కోరుకుంటున్నట్లు చెప్పారు. సమితి బాధ్యులు పాల్వంచ రాజేశ్, చీకటి రాంబాబు, దేవభక్తిని నవీన్, రేగళ్ల కృష్ణప్రసాద్, మునిగంటి భార్గవ్, పగడాల రవి, మంకెన అజయ్, బయ్యన అశోక్, వట్టికొండ మానస్ తదితరులు పాల్గొన్నారు.

# కొత్త సంబురం

- ఉమ్మడి జిల్లాలో ఆదివారం అర్ధరాత్రి నుంచే న్యూ ఇయర్ వేడుకలు
- కేకులు కట్ చేసి.. డీజే మోతల నడుమ యువత నృత్యాలు
- ఇళ్ల ముంగిళ్లలో రంగురంగుల రంగవల్లులతో ఆహ్వానం
- తెల్లవారుజాము నుంచే కిటకిటలాడిన ఆలయాలు, చర్చిలు
- పరస్పరం శుభాకాంక్షలు చెప్పుకున్న మిత్రులు, బంధువులు

కోటి ఆశలతో స్వాగతం పలుకుతూ జరుపుకునే న్యూ ఇయర్ వేడుకలు అంబరాన్నంటాయి. పాత ఏడాది 2023కు వీడ్కోలు చెబుతూ.. 2024 సంవత్సరంలోకి అడుగిడుతూ ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ప్రజలు ఉత్సాహంతో నూతన సంవత్సర సంబురాలు జరుపుకున్నారు. ఆదివారం అర్ధరాత్రి నుంచి యువతీ యువకులు కేకులు కట్ చేసి.. డీజే మోతల నడుమ నృత్యాలు చేస్తూ.. కేరింతలు కొడుతూ ఉత్సాహభరిత వాతావరణంలో వేడుకలు చేసుకున్నారు. మహిళలు కొత్త సంవత్సరాన్ని ఆహ్వానిస్తూ ఇళ్ల ముంగిళ్లను రంగురంగుల రంగవల్లులతో తీర్చిదిద్దారు. 'హ్యాపీ న్యూ ఇయర్' అంటూ ముగ్గులతో రాసి మురిసిపోయారు. తెల్లవారుజాము నుంచే అలంకరించిన ఆలయాలు, చర్చిలకు వెళ్లి పూజలు, ప్రార్థనలు చేశారు. భక్తులతో ఆలయ, చర్చి ప్రాంగణాలు కిటకిటలాడాయి. కొత్త సంవత్సరంలో అంతా మంచే జరగాలని, వ్యవసాయం బాగుండాలని.. పాడిపంటలతో తులతూగాలని, పిల్లలు చదువులో రాణించి ఉన్నత స్థాయికి ఎదగాలని కోరుతూ భక్తిభావంతో పూజలు, ప్రార్థనలు చేశారు. మిత్రులు, కుటుంబ సభ్యులు పరస్పరం వాట్సప్, ఇన్‌స్టా తదితర మాధ్యమాల పోస్టులతో పాటు స్వయంగా కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు చెప్పుకున్నారు. –నమస్తే నెట్‌వర్క్


ఎమ్మెల్యే జారే ఆదినారాయణకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలుపుతున్న పోలీస్ అధికారులు


జడ్పీ చైర్మన్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న సీఈవో, డిప్యూటీ సీఈవో


సండ్రకు శుభాకాంక్షలు తెలుపుతున్న బీఆర్‌ఎస్ నాయకులు


చర్ల :ముగ్గులు వేస్తున్న మహిళలు



ఖమ్మం నర్సింహస్వామి ఆలయం వద్ద సందడి


పూజలో పాల్గొన్న ఎమ్మెల్యే కోరం కనకయ్య, లక్ష్మి దంపతులు


ఖమ్మం నర్సింహస్వామి ఆలయంలో భక్తుల పూజలు


ఎర్రుపాలెం : స్వామివారిని దర్శించుకునేందుకు బారులు తీరిన భక్తులు

## 120 కిలోల గంజాయి పట్టివేత

### ఇనుప బీరువాల్లో అమర్చి పకడ్బందీగా తరలిస్తున్న దుండగులు
### వాహన తనిఖీల్లో గుర్తించి పట్టుకున్న టేకులపల్లి పోలీసులు
### విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించిన ఎస్పీ వినీత్ జీ


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ వినీత్ జీ

కొత్తగూడెం క్రైం, జనవరి 1 : సినీ ఫక్కీలో గంజాయిని బీరువాలో అమర్చి తరలిస్తున్న వాహనాన్ని టేకులపల్లి పోలీసులు గుర్తించి పట్టుకున్నట్లు జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ గంగన్న తెలిపారు. కొత్తగూడెంలోని తన కార్యాలయ ఆవరణలో సోమవారం విలేకరుల సమావేశం నిర్వహించి ఇందుకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. గంజాయి అక్రమ రవాణా జరుగుతున్నట్లుగా టేకులపల్లి పోలీసులకు గత నెల 28న విశ్వసనీయ సమాచారం వచ్చింది. దీంతో ఇల్లెందు డీఎస్పీ రమణమూర్తి ఆధ్వర్యంలో టేకులపల్లి సీఐ ఇంద్రసేనారెడ్డి, ఎస్సై రమణారెడ్డి ఆ ప్రాంతంలో వాహన తనిఖీలు చేపట్టారు. ఈ క్రమంలో అటువైపుగా ఇనుప బీరువాల లోడుతో వస్తున్న కర్ణాటక రాష్ట్రం బీదర్‌కు చెందిన ట్రక్కు డ్రైవర్ పోలీసుల తనిఖీలను గమనించి టేకులపల్లి పెట్రోల్ బంకు వెనుక వాహనాన్ని నిలిపివేసి పారిపోయాడు. అక్కడ ఓ వాహనం రెండు రోజులుగా అనుమానాస్పదంగా ఉన్నదని సోమవారం ఉదయం పోలీసులకు స్థానికులు సమాచారం అందించారు. దీంతో పోలీసులు వాహనాన్ని స్వాధీనపరుచుకొని పరిశీలించారు. అయితే బీరువాలు బరువు ఎక్కువగా ఉండడంతో వాటిని నిశితంగా పరిశీలించారు. ఈ నేపథ్యంలో పోలీసులను ఆశ్చర్యానికి గురి చేసే ఘటన ఎదురైంది. ఏకంగా గంజాయి ప్యాకెట్లను బీరువాల వెనుక భాగం లోపల అమర్చి వాటిని తయారు చేశారు. బీరువాలను కట్ చేసి అందులో ఉన్న రూ.30 లక్షల విలువ చేసే 120 కేజీల గంజాయితోపాటు వాహనాన్ని పోలీసులు స్టేషన్‌కి తరలించి సీజ్ చేశారు. కేసు విచారణలో భాగంగా ఆ వాహనం కర్ణాటక రాష్ట్రం బీదర్‌కు చెందిన మహ్మద్ షకీల్ పాషా వద్ద నుంచి అతనికి తెలిసిన మజార్ అనే డ్రైవర్ కిరాయికి తీసుకెళ్లినట్లు ఎస్పీ వివరించారు. ప్రస్తుతం పరారీలో ఉన్న నిందితుడు మజార్ కోసం గాలింపు చర్యలు చేపడుతున్నట్లు ఆయన తెలిపారు. ఇకపై ఎవరైనా గంజాయి రవాణా చేస్తున్నట్లుపోలీసులకు సమాచారం ఇస్తే వెంటనే చర్యలు తీసుకుంటామని ఎస్పీ తెలిపారు. సమావేశంలో ఇల్లెందు డీఎస్పీ కేవీ రమణమూర్తి, టేకులపల్లి సీఐ ఇంద్రసేనారెడ్డి, ఎస్సై గన్‌రెడ్డి రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## కొత్త ఆశలతో ముందకెళ్దాం..

### భద్రాద్రి జడ్పీ చైర్మన్ కంచర్ల చంద్రశేఖర్‌రావు


చైర్మన్ కంచర్లకు శుభాకాంక్షలు చెబుతున్న నాయకులు

భద్రాద్రి కొత్తగూడెం, జనవరి 1 (నమస్తే తెలంగాణ) : నూతన సంవత్సరంలో మరిన్ని ఆశలతో ముందుకు వెళ్దామని జడ్పీ చైర్మన్ కంచర్ల చంద్రశేఖర్‌రావు అన్నారు. కొత్త సంవత్సరాన్ని పురస్కరించుకొని సోమవారం ఆయన జడ్పీ కార్యాలయంలోని తన చాంబర్‌లో కేక్ కట్ చేసారు. ఈ సందర్భంగా ఉద్యోగులు, ప్రజాప్రతినిధులు ఆయనకు పుష్పగుచ్ఛాలు అందించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఏ రంగంలోనైనా ఎన్ని ఆటంకాలు ఎదురైనా స్ఫూర్తితో ముందుకు వెళ్లాలన్నారు. ప్రభుత్వ పథకాలు ప్రజలకు అందేలా చూడాలన్నారు. అందరం కలిసి ముందుకు వెళితేనే ప్రగతి సాధించవచ్చన్నారు. కార్యక్రమంలో గ్రంథాలయ వైస్ చైర్మన్ మోరే భాస్కర్, మార్కెట్ మాజీ చైర్మన్ రాంబాబు, ఎంపీటీసీ కూసన వీరభద్రం, మాజీ సర్పంచ్ రుక్మిణి, తెలంగాణ ఉద్యమకారులు హుస్సేన్, రాజు గౌడ్, బుజ్జి, మధు, ఐలయ్య, ఆత్మ కమిటీ డైరెక్టర్ కరుణాకర్, సంపు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## ఉమ్మడి జిల్లా పోలీసు శాఖకు పతకాలు

- 11 మందికి కఠిన సేవా, 41 మందికి సేవా పతకాలు
- ఉత్తర్వులు విడుదల చేసిన రాష్ట్ర ప్రభుత్వం


తోమల రవి


సాదుల సారంగపాణి

కొత్తగూడెం క్రైం, జనవరి 1: పోలీసు శాఖలో విధుల పట్ల ప్రతిభను కనబరిచిన పోలీసు అధికారులు, సిబ్బందికి నూతన సంవత్సరం సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం 'సేవా' పతకాలను ప్రకటించింది. ఈ మేరకు సోమవారం ఉత్తర్వులు విడుదల చేసింది. ఇందులో భాగంగా ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో పలువురు పోలీసు అధికారులు, సిబ్బంది ఈ పతకాలను ఎంపికయ్యారు. పతకాల వారీగా వారి వివరాలు ఇలా ఉన్నాయి.

**సేవా పతకం..**

ఈ పతకానికి తోమల రవి (అసిస్టెంట్ సీపీ, ఖమ్మం), ఎస్.సారంగపాణి (అసిస్టెంట్ సీపీ, ఖమ్మం), ఏకాంబరం రమేశ్ (ఏసీబీ, డీఎస్పీ), సీహెచ్ రాజిరెడ్డి (ఐవోపీ, ఖమ్మం), ఎం.ధనయ్య (ఎస్సై, ఖమ్మం), పీవీవీ సత్యనారాయణ (ఎస్సై, ఖమ్మం), డీ.గోపాలరావు (ఏఎస్సై–1690), ఎండీ సుజద్దీన్ (ఏఆర్‌ఎస్సై–6878), సీహెచ్ ముత్తయ్య (హెచ్‌సీ–604), ఎం.వెంకటేశ్వర్లు (హెచ్‌సీ–863), బీ.శ్రీనివాసరావు (హెచ్‌సీ–704), డీ.శ్రీనివాసరావు (ఏఆర్‌హెచ్‌సీ–1246), వీ.నాగేశ్వరరావు (పీసీ–32), ఎస్.సైదులు (పీసీ–579), దేవేండ్ల రామయ్య (ఏఎస్సై–2018), బీ.వెంకటేశ్వర్లు (హెచ్‌సీ–1979), ఎం.కృష్ణమూర్తి (హెచ్‌సీ–860), చిలుక దాసు (హెచ్‌సీ–1761), కాశిన శ్రీనివాసరావు (హెచ్‌సీ–1868), గంధసిరి సోమయ్య (హెచ్‌సీ–1497), గజ్జల శ్రీనివాస్ దాస్ (పీసీ–741), బీ.శ్రీనివాస్ (ఏఆర్‌పీసీ–1633), భద్రాద్రి జిల్లాలో డీ.అనంతరాములు (ఎస్సై), జాస్తి సుధాకర్ (హెచ్‌సీ–1305), సాదు లక్ష్మీనారాయణ (ఏఆర్‌హెచ్‌సీ–792), ఎస్.వెంకటేశ్వర్లు (హెచ్‌సీ–2200), కే.జయరాజు (ఏఆర్‌హెచ్‌సీ–3344), గంజి శశిధర్ (ఏఎస్సై–3507), గాదె ప్రతాపరెడ్డి (ఏఎస్సై), వడే నాగేశ్వరరావు(హెచ్‌సీ–2040), యాత శ్రీనివాసరావు (హెచ్‌సీ–1845), బానోత్ రామారావు (హెచ్‌సీ–2079), షేక్ ఖాసీం (ఏఆర్‌హెచ్‌సీ–247), యూ.వెంకన్న బాబు (ఇంటెలిజెన్స్ డీఎస్పీ), సూర సత్యనారాయణ (ఏఎస్సై–816), పంచడి రంగారావు (ఏఆర్‌ఎస్సై–1877), అనుమోలు నర్సింహారెడ్డి (హెచ్‌సీ–333), వంగ హరినాథ్‌బాబు (పీసీ–2220), 15వ బెటాలియన్‌కు చెందిన నరాల సత్యనారాయణ ప్రసాద్ (ఆర్‌ఎస్సై–2149), టీ.సంజయ్ సింగ్ (ఆర్‌ఎస్సై, టీఎస్‌ఎస్‌పీ), వై.వెంకటేశ్వరరావు (లీడింగ్ ఫైర్‌మెన్) ఎంపికయ్యారు.

**కఠిన సేవా పతకం..**


ఈ పతానికి ఎస్‌కే అబ్దుల్ రెహమాన్ (ఏఆర్‌పీసీ–3331), ఏ.నాగేశ్వరరావు (ఏఆర్‌పీసీ–3231), పెరుగు మల్లయ్య (పీసీ–3056), కే.రమేశ్ (పీసీ–3197), బొడ్డుపల్లి నరేశ్ (పీసీ–3088), డీ.సింహాచలం (పీసీ–3170), బానోత్ నరేశ్‌కుమార్ (పీసీ–3023), కే.మహేందర్‌రెడ్డి (పీసీ–3085), షేక్ ఉస్మాన్ (పీసీ–3118), ఎస్.మధు (పీసీ–3119), జీ.రవీంద్ర (పీసీ–3022) ఎంపికయ్యారు.

# సాగునీటికి సంకటం

- ఎగువన వర్షాలు లేకపోవడంతో జలకళను కోల్పోయిన 'సాగర్ డ్యాం'
- జిల్లాలో సాగర్ ఎడమ కాల్వ ఆయకట్టు రూ.2.54 లక్షల ఎకరాలు
- రెండోజోన్‌లో అంతంతమాత్రంగా వానకాలం సాగు
- ఆదుకున్న శ్రీరాంసాగర్ జలాలు
- ఇక యాసంగి సాగు ప్రశ్నార్థకమే..
- ఆరుతడి పంటల వైపే రైతుల మొగ్గు


పాలేరు రిజర్వాయర్

కూసుమంచి, జనవరి 1 : యాసంగికి తగినంత జలాలు లేకపోవడంతో ఖమ్మం జిల్లాలోని 17 మండలాల పరిధిలో 2,54,274 ఎకరాల్లో సాగు ప్రశ్నార్థకమైంది. ఆయకట్టుకు సాగునీరు అందించే పాలేరు బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌కు ఎగువ నుంచి జలాలు రాకపోవడంతోనే ఈ పరిస్థితి ఏర్పడింది. గత వానకాలంలో సాగునీరు ఇవ్వలేమని నీటిపారుదల శాఖ అధికారులు తెలిపినప్పటికీ రైతులు సుమారు 1.20 లక్షల ఎకరాల్లో వరి సాగు చేపట్టారు. వారబందీ ప్రకారం అందిన నీటి వరకు సద్వినియోగం చేసుకుని పంటలను కాపాడుకున్నారు. కానీ.. యాసంగిలో మాత్రం సాధారణ పంటలకు బదులు కేవలం ఆరుతడి పంటలు పండించే అవకాశం కనిపిస్తున్నది. రైతులు కేవలం బోరు బావులపైనే ఆధారపడే పరిస్థితి నెలకొన్నది.


బావులు, బోర్ల కింద వరి నారుమళ్లు

**కేవలం తాగునీటికే జలాలు..**

కర్ణాటకలో ఈ ఏడాది తక్కువ వర్షపాతం కురవడంతో ఆల్మట్టితో ఇతర ప్రాజెక్టులూ జలకళను కోల్పోయాయి. దీంతో కృష్ణా ఆయకట్టులో సాగు ప్రశ్నార్థకంగా మారింది. యాసంగికి కావాల్సిన మేర జలాలు లేకపోవడంతో అందుబాటులో ఉన్న జలాలను తాగునీటి అవసరాలకు వినియోగించాలని ఇరిగేషన్ అధికారులు యోచిస్తున్నారు. దేవులపల్లి, పాలేరు, వైరా వంటి రిజర్వాయర్ల నుంచి తాగునీటి అవసరాలకు నీటి వినియోగించుకునే పరిస్థితి కనిపిస్తున్నది. సాగర్ ఎడమ కాలువపై ఆధారపడి ఉమ్మడి నల్లగొండ, ఖమ్మం జిల్లాల పరిధిలో 6,40,000 ఎకరాల ఆయకట్టు ఆధారపడి ఉన్నది. ఆయకట్టులో రైతులు యాసంగి సాగు చేపట్టాలంటే కనీసం 50 టీఎంసీల నీరు కావాల్సి ఉన్నది. కానీ.. ప్రస్తుత పరిస్థితుల్లో అంత నీరు లభ్యమయ్యే పరిస్థితి లేదు. ఈ మేరకు ఇప్పటికే ఇరిగేషన్ అధికారులు సర్కార్‌కు నివేదికలు సైతం అందించారు. దీంతో మొదటి జోన్ వరకైనా నీరు వస్తుందని ఆశించిన రైతులకు నిరాశ ఎదురైంది. ఇక పాలేరు రిజర్వాయర్ నుంచి కల్లూరు వరకు ఉండే రెండో జోన్ ఆయకట్టు రైతుల సంగతి వేరే చెప్పనక్కర్లేదు.

**దశాబ్దం తర్వాత ఈ పరిస్థితి..**

11 సంవత్సరాల కిందట ఒకసారి సాగునీటి కొరత వచ్చింది. అప్పుడు కేవలం ఏడాదిలో వానకాలంలో మాత్రమే పంటలకు జలాలు అందాయి. యాసంగికి నీటి కొరత వచ్చింది. ఎగువ రాష్ట్రమైన కర్ణాటకలో వర్షపాతం లేకపోవడంతో కృష్ణా జలాలు మన వరకు రాలేదు. తిరిగి మళ్లీ అదే పరిస్థితి వచ్చింది. వానకాలం అరకొరగా పంటలకు నీరందగా యాసంగికి నీటి ఎద్దడి ఏర్పడింది.

**ఎల్‌నినో ప్రభావంతోనే..**

సహజంగా ఏటా జూన్ మొదటి వారం నుంచి కేరళ నుంచి వచ్చే రుతుపవనాలు పసిఫిక్ మహాసముద్రంలో ఏర్పడే ఎల్‌నినో కారణంగా బలహీనపడ్డాయి. వానల రాక ఆలస్యమైంది. దీంతో తెలుగు రాష్ట్రాల్లో వానకాలం సాగు వెనుకబడింది. ఆ ప్రభావం యాసంగి సాగుపైనా పడింది. కృష్ణా ఆయకట్టుకు సాగుజలాల కొరత ఏర్పడింది.

### శ్రీరాంసాగర్ జలాలే రక్ష..

పాలేరు రిజర్వాయర్‌కు ఈసారి శ్రీరాం సాగర్ జలాలే రక్షగా కనిపిస్తున్నాయి. సుమారు 360 కి.మీ దూరం నుంచి ఇరిగేషన్ అధికారులు పొరుగు జిల్లా అయిన మహబూబాబాద్ జిల్లా పరిధిలోని బయ్యారం చెరువు అలుగు వరకు జలాలను తీసుకొచ్చారు. అక్కడి నుంచి గ్రావిటీ ద్వారా బయ్యన్న వాగు నుంచి పాలేరుకు శ్రీరాంసాగర్ జలాలను తరలించి గత సీజన్‌లో పంటలను కాపాడారు. ఈసారి నీటి ఎద్దడి ఎదురైతే ఈ తరహాలోనే మరోసారి జలాలు తీసుకురావాలని అధికారులు యోచిస్తున్నారు.


జిల్లాకు నీరందించే పాలేరు కాలువ

### నీరు లేక మక్క వేస్తున్నా



నాకు 8 ఎకరాల భూమి ఉంది. వానకాలం సాగర్ నీరు రాకపోవడంతో 5 ఎకరాల్లో పత్తి వేశా. బోర్ కింద మూడు ఎకరాల్లో వరి వేశా. సాగర్ జలాలు వస్తే మొత్తం 8 ఎకరాల్లో వరి వేసేవాడిని. ఈసారి యాసంగికి పత్తి చెడగొట్టి మక్క వేద్దామనుకొంటున్నా. సాగర్‌లో నీరు లేకపోవడం వల్ల వరికి నీరందే పరిస్థితి లేదు. దీంతో వరికి బదులుగా ప్రత్యామ్నాయ పంటలు వేయాలని నిర్ణయించుకున్నాం.

– దండా సత్యనారాయణ, రైతు, రాజేశ్వరపురం

### పొలం వేయలేదు



నాకు ఎనిమిది ఎకరాల భూమి ఉంది. ఇం దులో ఏటా వరి పండించేవాడిని. కానీ.. ఈసారి సాగర్ నీరు రాకపోవడంతో పొలం వేయకుండా ఇతర పం టలు వేశాం. యాసంగికి కూడా నీరు రాదని తెలిసింది. ఇంకా ఏ పంట వేయాలని నిర్ణయించుకోలేదు. వానకాలానికే నీరు రాలేదు. యాసంగికి నీరు రాదని తెలుస్తోంది. ఇతర పంటలు వేయాలనుకొంటున్నాం.

– కట్టెకోల సాంబయ్య, రైతు, బోదులబండ

## రామయ్య సేవలో భద్రాచలం ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం


రామయ్యను దర్శించుకున్న ఎమ్మెల్యే తెల్లం

భద్రాచలం, జనవరి 1 : భద్రాచలం సీతా రామచంద్రస్వామివారిని భద్రాచలం ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు సోమవారం దర్శించుకున్నారు. ఆలయ అధికారులు ఆయనకు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. తొలుత ధ్వజస్థంభం వద్ద నమస్కరించుకొని అంతరాలయంలోని మూలవరుల వద్ద ప్రత్యేక పూజలు జరుపుకున్నారు. అనంతరం అమ్మవారి సన్నిధిలో అర్చకులు ఆయనకు వేదాశీర్వచనం, స్వామివారి ప్రసాదాలు, శేష వస్త్రాలు అందజేశారు.

## రామయ్యకు రాపత్తు సేవ

భద్రాచలం, జనవరి 1: భద్రాచలం సీతారామచంద్రస్వామివారి దేవస్థానంలో నిర్వహిస్తున్న ముక్కోటి ఏకాదశి అధ్యయనోత్సవాల్లో భాగంగా రామయ్యకు సోమవారం ఆలయ ప్రాంగణంలోని బేడా మండపంలో రాపత్తు సేవను వైభవంగా జరిపారు. ముందుగా స్వామివారిని పరవాసుదేవుడు అలంకారంలో అందంగా అలంకరించి, మేళతాళాల నడుమ బేడా మండపానికి తీసుకొని వచ్చి ముందుగా విశ్వక్సేన ఆరాధన, పుణ్యాహవాచనం, శ్రీరామ అష్టోత్తర శతనామార్చాన తదితర పూజలు నిర్వహించారు. దేవస్థానం ఈవో రమాదేవి, ఏఈవో శ్రావణ్‌కుమార్, ఆలయ అధికారి లింగాల సాయిబాబా, తదితరులు పాల్గొన్నారు.


రామయ్యకు రాపత్తు సేవ నిర్వహిస్తున్న అర్చకులుడు